క్లుప్తంగా

పారామెడిక్స్ పాత్ర కీలకం

రాయదుర్గం: సమాజంలో పారా మెడిక్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తారని బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ తుప్పిల్ వెంకటేష్ పేర్కొన్నారు. మనూలో ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా (ఎఫ్‌క్యూఐ), స్కూల్ ఆఫ్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'అవేర్‌నెస్ ఆఫ్ క్వాలిటీ కంట్రోల్ ఇన్ మెడికల్ లాబొరేటరీస్' అనే అంశంపై బ్యాచులర్ ఆఫ్ ఒకేషనల్ మెడికల్ లేబరేటరీ విద్యార్థులకు ఒకరోజు ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారామెడిక్స్ అనే వారు టెక్నాలజిస్ట్స్, వైద్యుల మధ్య వారధిగా వ్యవహరిస్తారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హోంగార్డుల వినతి

రాయదుర్గం: తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సోమేష్‌కుమార్‌కు సమస్యలపై వినతిపత్రాన్ని అందించినట్లు సైబరాబాద్ హోంగార్డుల అధ్యక్షుడు అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. దక్షిణ భారత ప్రతినిధి డాక్టర్ కొత్వాల్ దయానంద్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు హరిబాబు, మన్మధరావు, తిరుపతి, కుమార్‌తో కలసి వినతిపత్రం అందించామన్నారు. తెలంగాణ రాష్ట్ర హోంగార్డులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్డ్ అయిన హోంగార్డులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని వినతిపత్రంలో కోరినట్లు పేర్కొన్నారు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



సత్యం శ్రీరంగంను కలిసిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాయపాటి హరీష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన రాయపాటి హరీష్ మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు క్రిష్ణారాజ్ పుత్, అజయ్, శ్రావణ్, వంశీ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్కిల్ –21 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంతిని మంగళవారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ రోడ్డులో కల్వర్టు పనులు, తారానగర్, ఇంద్రానగర్ శ్మశానవాటిక పనులను, వేమన కాలనీలోని ఎస్టీపీ పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్, రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న బాబూరావు తదితరులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్డు నం.7లో నూతనంగా వేస్తున్న డ్రైనేజీ పైపులైన్ల పనులు, సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం హబీబ్‌నగర్‌లో జరుగుతున్న వర్షపు నీటి కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్ గౌడ్, ఖైలా, సుశీల్ కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.







మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న అరుదైన చిత్రాలు

చిత్రం చెప్పే 'స్వాతంత్య్రం'


చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో మేరి మాటి–మేరా దేశ్ చిత్ర ప్రదర్శన

మాదాపూర్: నేటి స్వేచ్ఛ.. స్వాతంత్రం నాటి త్యాగధనుల ప్రతిఫలమే. అలాంటి సమర యోధుల చరిత్రను వివరించే విధంగా మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను సెంట్రల్ బ్యూరోఆఫ్ కమ్యూనికేషన్, చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మేరి మాటి–మేరా దేశ్ పేరిట ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు







చిన్నారులకు సమరయోధులు తెలియదు



మహనీయుల త్యాగఫలం వల్లనే స్వాతంత్య్రం వచ్చిందని సమయం ఉన్నప్పుడల్లా చిన్నారులకు చెప్పాలి. ఫొటోలతో సహా చూపించి వారి గొప్పతనాన్ని వివరించినప్పుడే చిన్నారులకు శాశ్వతంగా గుర్తుంటుంది. దీని వల్ల మంచి నడవడిక, సామాజిక బాధ్యత, పెద్దలపట్ల గౌరవం పెరుగుతాయి. దీంతో మంచి నడవడికతో పెరుగుతారు.

– సారా, సందర్శకురాలు

రోజు ఒక సమరయోధుడి గాథ వినిపించాలి



పాఠశాలలో కనీసం 20 నిమిషాలు ప్రతి రోజు ఒక సమరయోధుని గురించి చెప్పాలి. లక్ష్యసాధన కోసం చేసిన కృషి, పట్టుదల, చేసిన త్యాగాలు, గుర్తు చేయాలి. పూర్వ రాజకీయాలు, నేటి రాజకీయాలకు ఉన్న వ్యత్యాసాలను వివరించాలి.

– భగీరధ, సందర్శకురాలు

అందరికీ తెలియాలనే లక్ష్యంతో..



ఫొటోగ్రాఫర్ కుల్వంత్‌రాయ్ (1914–1984) మధ్య కాలంలో తీసిన ఫొటోలు అరుదైన చిత్రాలు. సమావేశాల సమయంలో, అప్పటి దేశ పరిస్థితులను తెలిపే విధంగా అరుదైన చిత్రాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి ప్రదర్శనను ప్రతి ఒక్కరు తిలకించాలి. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఉంటుంది. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శించవచ్చు.

– యాక్విన్, నిర్వాహకుడు

ఓటును వినియోగించుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలో ఎంతో చైతన్యం కలిగి ఉన్న వయోవృద్ధులు ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు స్వీప్ ప్రచారంలో భాగంగా సీనియర్ సిటిజెన్స్‌కు అవగాహన సమావేశం నిర్వహించారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేస్తూ పలు సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని ఆయన గుర్తుచేశారు. 80 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటును వినియోగించుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ఇంటి నుంచి ఓటు వేయాలనుకున్న వారు ఎన్నికల ప్రకటన వెలువడిన మీదట నిర్ణీత ఫారం నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే, పోలింగ్ అధికారి నేతృత్వంలోని సిబ్బంది వారి ఇంటి వద్దకు వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. వయోవృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చెయిర్ వంటి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేశారు. పలువురు సీనియర్ సిటిజెన్స్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసమూర్తి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కు పత్రాల అందజేత

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ కాలనీలో జీఓ నం.58, 59కు దరఖాస్తు చేసుకున్న ఆరుగురికి యాజమాన్య హక్కు పత్రం మంజూరయ్యింది. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం వారికి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీఓ నం.58 పేదల ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేసి భరోసా కల్పిస్తున్న మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. జీఓ నం.59 కింద ప్రభుత్వం నిర్ణయించిన డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వ కల్పించిన 5శాతం రాయితీని సైతం పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు, దర్మారావు, చెర్ల రామకృష్ణారెడ్డి, కనకారెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

జీహెచ్ఎంసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు



జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ కార్మికులకు మద్దతు పలికిన సీఐటీయూ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులు, జీహెచ్ఎంసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. జీహెచ్ఎంసీ కార్మికులు 300 జీతం నుంచి పనిచేస్తున్నా పర్మినెంట్ చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ చేసి పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కార్మిక సంఘాల నేతలు, కార్మికులను వెంటనే చర్చలకు పిలవాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీలం చిరంజీవి, మహంకాళి సూరి, ప్రకాష్, జీహెచ్ఎంసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–1, 2లలో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సమస్యల పరిష్కారానికి కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న చిన్న పనులను వెంటనే పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, రాజేష్‌చంద్ర, కాశీనాథ్‌యాదవ్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌నాయక్, బి.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు

నేటి నుంచి కాంగ్రెస్ బస్తీ భరోసా యాత్ర

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, బీజేపీ హామీలు, మోదీ పాలన వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇస్తున్న హామీలను తెలియజేసేందుకు బుధవారం నుంచి బస్తీ భరోసా యాత్ర నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్‌రావు, డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో పీసీసీ సభ్యులు దండుగుల యాదగిరి నివాసంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు కె.మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో యాత్రను మొదలు పెడుతున్నాట్లు చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ కోసం పని చేస్తున్న నాయకుల్లో ఎవరికిచ్చినా ఐక్యతతో పోరాడి గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ల అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, తూము వేణు, సంతోష్, కుక్కల రమేష్, మధుగౌడ్, కృష్ణారాజు పుత్, మేకల రమేష్, షఫీ, విజయలక్ష్మి, అస్లాం, కిరణ్, అరుణ్‌రెడ్డి, రాయపాటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై డీసీ సమీక్ష సమావేశం

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ –21 కార్యాలయంలో శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో మంగళవారం ఉపకమిషనర్ వంశీకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీ వంశీకృష్ణ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రధాన రోడ్లు, బస్తీలలో పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య కార్మికులు సమయపాలన పాటించాలన్నారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలతో పాటు బ్యానర్లు ఏర్పాటుతో పాటు ముగ్గులు వేయాలన్నారు.

బిల్లులు చెల్లించాలి

హఫీజ్‌పేట్: ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తమకు ఇవ్వాల్సిన బిల్లులు చెల్లించడం లేదని మంగళవారం కాంట్రాక్టర్లు, కూలీలు ఆందోళన చేపట్టారు. ఇందులో లేబర్ కాంటాక్ట్ తీసుకున్న సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ సర్వే నంబర్ 78, 80లో 8 ఎకరాలలో ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టిందని ఇందులో లేబర్ కాంటాక్ట్ తీసుకున్న తమకు ఏళ్ల తరబడి బిల్లులు ఇవ్వడం లేదని, బిల్లులు అడిగేందుకు వచ్చిన తమపై బౌన్సర్లతో దాడి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలతో ఉండే నేతలతోనే సమాజానికి ఉపయోగం

• కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు

కూకట్‌పల్లి: బీజేపీ ప్రవాస్ యోజనలో భాగంగా వివేకానందనగర్, హైదర్‌నగర్ డివిజన్లలోని బీజేపీ కార్యవర్గ సమావేశంలో మంగళవారం కర్ణాటక రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ మూడు నెలలు పూర్తి సమయం పార్టీకి కేటాయించి ఒక్కొక్క నాయకుడు 100 ఓట్లు పోలింగ్ బూత్‌లలో వేయించాలన్నారు. అలాంటి నాయకులని తయారు చేయాలన్నారు. చాలా మంది నాయకులు పేపర్లలో పెద్ద ప్రకటనలు వేయించుకొని తిరుగుతూ హల్‌చల్ చేస్తారని కానీ ప్రజల్లో మాత్రం వారికి వ్యతిరేకత ఉంటుందన్నారు. ప్రజల కోసం సేవ చేసి అందుబాటులో ఉండే నాయకులతోనే సమాజానికి ఉపయోగం ఉంటుందన్నారు.

◆ ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొరదాల నరేష్ మాట్లాడుతూ... ప్రతి డివిజన్‌లో ప్రతి బూత్‌లో బలమైన నాయకత్వం ఉండాలన్నారు. ఓటర్ లిస్టులో ఉన్న పేర్లను ఆ బూత్‌ను చూసే నాయకులకు అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క ఓటర్‌ను గుర్తించాలని ప్రతి ఒక్క గడపని కనీసం వారానికి ఒకసారైనా టచ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జానకి రామరాజు, సత్యనారాయణ, రవీందర్‌రావు, రాఘవేంద్రరావు, మణిభూషణ చారి, నవీన్‌గౌడ్, నర్సింగ్‌రావు, అరుణ్, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, కొరదాల నరేష్ తదితరులు

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే రూ.42లక్షల నిధులతో ఏవీబీపురం కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, కాలనీ వాసులు నారాయణ, వెంకట్రావు, వాసు, సింహాద్రి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



ఏవీబీపురంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

తక్కువ ధరకే సర్వైకల్ కేన్సర్‌కు ముందస్తు వ్యాక్సిన్

• రాందేవ్ రావ్ ఆస్పత్రి సీఈఓ యోబు



ఆల్విన్‌కాలనీ: రాందేవ్ రావ్ ఆస్పత్రి 15వ వార్షికోత్సవం సందర్భంగా సర్వైకల్ కేన్సర్‌కు ముందస్తు వ్యాక్సిన్‌ను తక్కువ ధరకే అందజేయనున్నట్లు ఆసుపతి సీఈఓ యోబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ముందస్తు వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా జీవిత కాలం ఈ వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. సర్వైకల్ గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ని నివారించేందుకు ముందస్తుగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సిన్‌ను ఇవ్వాల్సి ఉందన్నారు.

◆ ఈ వ్యాక్సిన్ మార్కెట్‌లో 4 వేలకు పైగా లభిస్తుందన్నారు. తమ ఆస్పత్రిలో కేవలం రూ.వేయికే అందిస్తున్నామని తెలిపారు. 9 నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉన్న ఆడ, మగ పిల్లలకు రెండు డోసులు ఇవ్వాల్సి ఉందన్నారు. 15 నుంచి 45 మధ్య వయసు గల మహిళలకు మూడు డోసులు చొప్పున ముందస్తుగా ఇవ్వడంతో కేన్సర్ బారి నుంచి తప్పించవచ్చని తెలిపారు.

◆ ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం విక్రమ్‌దేవ్ రావ్, మీరారావ్, అపర్ణరావ్, ప్రశాంత్‌రెడ్డిలు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని ఆసుపత్రి డైరెక్టర్‌డాక్టర్ కమలాకర్, గైనకాలజీ హెడ్ డాక్టర్ ఛాయాదేవి, చిన్న పిల్లల డాక్టర్ భవాని, దివ్యలు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆసుపత్రి ఆవరణలోని మూడో అంతస్తులో వ్యాక్సిన్ ఇస్తారని పేర్కొన్నారు. వ్యాక్సిన్ కావాల్సిన వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మంగళవారం ఎమ్మెల్సీ నవీన్‌రావుతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పలువురు కార్పొరేటర్లు ముఖ్యమంత్రిని కలిసి . దన్యవాదాలు తెలిపారు.





ట్రెడిషనల్ డే

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని ప్రగతి కళాశాలలో ట్రెడిషనల్ డే మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతి సంవత్సరం కంటే భిన్నంగా ఈసారి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు వస్త్రధారణలో అలరించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు, తమిళ, మళయాల, రాజస్థాని, మరాఠీ, అస్సాం, కాశ్మీర్ ప్రాంతాల సంస్కృతులను తెలియజేసేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులకు శుభాకాంక్షల వెల్లువ

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. – కూకట్‌పల్లి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గజమాలతో సన్మానిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ రోజాదేవి